విత్తన చట్టాలపై అవగాహన తప్పనిసరి

- లైసెన్స్ ఉంటేనే ప్రైవేటుగా విత్తనాల విక్రయం
- విత్తనాలు కొంటే రశీదు ఇవ్వాలి



పామర్రులో విత్తనాలు విక్రయించే దుకాణం

పామర్రు: విత్తన చట్టంపై రైతులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఖరీఫ్ పనులు జోరుగా జరుగుతున్న ఈ తరుణంలో ప్రైవేటు దుకాణాల్లోనూ విత్తనాలు విక్రయాలు ఊపందుకున్నాయి. క్రయవిక్రయాలు అధికంగా జరిగే ఈ సీజన్‌లో రైతులు మోసపోయే అవకాశాలు కూడా ఎక్కువే. విత్తన చట్టం ద్వారా విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకుంటారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలు పొందుపరిచి విత్తనపరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు–3 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ ఏ ప్రకారం జరిమానా కూడా విధిస్తారు. జిల్లాలో సుమారు 417 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. 121 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 165 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 131 మంది పురుగుమందుల విక్రయాల డీలర్లు ఉన్నారు.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వుల–1989 క్లాజు–8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేస్తారు. అంతేకాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్స్ రద్దు చేస్తారు.

లేబుల్ లేక పోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకందారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేక పోతే విత్తన చట్టం–1966 సెక్షన్–7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. అంతేకాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ ప్రకారం జరిమానా విధిస్తారు.

- కాలం చెల్లిన విత్తనాలు అమ్మకాలు చేస్తే విత్తన చట్టం–1966 సెక్షన్ –7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు–8ను అనుసరిస్తూ డీలర్ లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

రశీదు ఇవ్వకపోతే లైసెన్స్ రద్దు

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు–9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్స్‌ను సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

లైసెన్స్ ప్రదర్శన తప్పని సరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్స్‌ను ప్రదర్శించాలి. అలా లేకుంటే ఆ దుకాణంలో విత్తనాల విక్రయాలను నిలిపివేయవచ్చు. అంతే కాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు–5 ప్రకారం డీలర్ లైసెన్స్ రద్దు చేయవచ్చు.

నిబంధనలు పాటించాల్సిందే

ప్రభుత్వం పొందు పరచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్స్‌ను పోగొట్టుకునే పరిస్థితి ఉంది. అధికారుల సూచనలను పాటిస్తూ విత్తనాలు విక్రయించాలి.

– స్వర్ణలత, ఏడీఏ, పామర్రు

అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ఆక్రమణ

- మొక్కల పేరుతో వేసిన ఫెన్సింగ్
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద రహదారి సమీపంలో నిర్మించిన ఫెన్సింగ్

కైకలూరు: పంచాయతీ రహదారిలో మొక్కల పేరుతో నిర్మించిన ఫెన్సింగ్ వివాదాస్పదంగా మారింది. కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుడికి ఇటీవల సన్మాన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో నిర్వాహకులు గుడి బయట మొక్కలు నాటించారు. ట్రీ గార్డులు కట్టారు. తర్వాత మొత్తం గుడి పొడవునా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పంచాయతీ కుళాయి సంపు ఉన్నాయి. సమీపంలో పాఠశాల విద్యార్థులు వందల సంఖ్యలో ఉన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం వచ్చే తల్లిదండ్రులు, బస్సులతో రహదారి ఇరుకుగా ఉంది. ఫెన్సింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, విద్యార్థులు, ప్రజలు ప్రమాదాల బారిన పడతారని పాఠశాల యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తోంది. మొక్కలకు 'ట్రీ' గార్డులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ నిర్మాణంతో ఇరుకుగా ఉన్నా రోడ్డులో వాహనాలకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై కైకలూరు పంచాయతీ సెక్రటరీ ఆదిరాజు వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. గుడి నిర్వాహకులు సత్యనారాయణను ఫెన్సింగ్ నిర్మాణంపై ప్రశ్నించగా గతంలో ఇక్కడ చెత్త కుండీ వల్ల దుర్వాసన వస్తోందని, అందుకే ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వరిలో కలుపు నివారణే కీలకం

కైకలూరు నియోజకవర్గంలో 22,462 ఎకరాల్లో వరిసాగు



కోరుకొల్లులో కలుపు మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కైకలూరు: వరి సాగులో కలుపు నివారణే కీలకమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి పొలాల్లో కలుపు వల్ల విపరీతమైన నష్టం వాటిల్లుతోంది. పైరు నుంచి సాగునీటి బలానికి ఈ కలుపు మొక్కలు పోటీకి వచ్చి బలహీనం చేస్తున్నాయి. పెరిగిన ట్రాక్టర్ల రేట్లు, కూలీల కొరత వంటి కారణాలతో అధికశాతం రైతులు వెదజల్లే పద్ధతిలోనే సాగునకు ఉపక్రమిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడంతో జూన్ ఆఖరి వారంలో వెదజల్లారు. కలుపు నివారణకు మార్కెట్‌లో అనేక కంపెనీల మందులు అందుబాటులో ఉన్నాయి. సరైన వాటిని ఎంచుకోవాలని వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

సాగు ఇలా..

నియోజకవర్గంలో కైకలూరు మండలంలో 2,500, కలిదిండి మండలంలో 1,400, మండవల్లి మండలంలో 4,562, ముదినేపల్లిలో 14,000 వెరసి 22,462 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వెదజల్లే పద్ధతిలో 17,762 ఎకరాలు, నాట్లు నాటే పద్ధతిలో 4,700 సాగు చేస్తున్నారు. ఎక్కువగా రైతులు సార్వలో ఎంటీయూ – 7029, ఎంటీయూ – 1318, ఎంటీయూ – 1061 రకాలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైరు 15 – 20 రోజుల వ్యవధిలో ఉంది. ఇప్పటికే ఆయా మండలాల్లో వ్యవసాయాధికారులు రైతులకు కలుపు నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు

కలుపు మొక్కలు గాలి, నీరు పోషకాలకు పైరుతో పాటు పెరగడం వల్ల 15 నుంచి 72 శాతం వరకు దిగుబడి తగ్గిపోతుంది. కలుపు మొక్కల వల్ల పైరుకు నష్టం లేకుండా ఉండాలంటే, వాటిని సాధ్యమైనంత వరకు ఏ పైరులోనైనా రెండు నుంచి ఆరు వారాల వరకు, పంట కాలంలో మొదటి 1/3 వంతు పంట కాలం కలుపు లేకుండా చూడాలి. కలుపు మొక్కలు వివిధ రకాల చీడపీడలకు సూక్ష్మజీవులకు ఆశ్రయం ఇస్తాయి. కలుపు విత్తనాల వల్ల ధాన్యం నాణ్యత తగ్గిపోతుంది. పంట కాలువల్లో కలుపు మొక్కలు నీటి ప్రవాహాన్ని తగ్గించడమే గాక నీటిని కలుషితం చేస్తాయి. కలుపు మొక్కలు నేలలోకి వివిధ రకాల విష పదార్థాలను వదలడం ద్వారా పైరుకు హాని చేస్తాయి. భూమి విలువలను తగ్గిస్తాయి. బహువార్షిక కలుపు మొక్కలైన తుంగ, గరిక ఎక్కువగా ఉన్నప్పుడు ఆ భూమి లాభదాయక సేద్యానికి అనువుగా ఉండక భూమి విలువ పడిపోతుంది. పొలంలో కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు కలుపు నివారణకు భూమి తయారీకి సస్యరక్షణకు ఎరువుల యాజమాన్యానికి కూలీలకు ఖర్చు ఎక్కువవుతుంది. దీంతో వ్యవసాయ ఖర్చులు పెరుగుతాయి. కలుపు మొక్కల వేళ్లు లోతుగా బలంగా ఉన్నచోట పొలంలో వాడే వివిధ రకాల పనిముట్లు ప్రత్యేకించి దున్నుటకు ఉపయోగించేవి త్వరగా అరిగిపోతాయి.

నివారణ చర్యలు

- విత్తిన మూడు నుంచి ఐదు రోజుల లోపు ఎకరానికి ప్రెటిలాక్లోర్, సేఫ్‌నర్ (సోఫిట్) కలిపి 600 నుంచి 800 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.
- గడ్డిజాతి కలుపు ఉన్నప్పుడు 8–10 రోజుల లోపు ఎకరాకు పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ (సా.డీ) 80 నుంచి 100 గ్రాములు పిచికారీ చేయాలి.
- విత్తిన 8–10 రోజులైతే ఆక్సాడయార్జిల్ 35–50 గ్రాములు లేదా బుటాక్లోర్ 1.0 –1.5 లీటర్లు చల్లాలి.
- గడ్డి జాతి కలుపు నివారణకు విత్తిన 15 రోజులకు ఎకరాకు సైహాలోఫాప్ బ్యుటైల్ 250 నుంచి 300 మిల్లీలీటర్లు చల్లాలి. ఫినాక్సాప్రాప్ పి ఇథైల్ 200 – 250 మిల్లీలీటర్లు చల్లవచ్చు.
- వెడల్పు ఆకు, గడ్డి జాతి కలుపు నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం 100 మిల్లీ లీటర్లు విత్తిన 20 రోజులకు చల్లాలి.
- విత్తిన నెల రోజులకు 2, 4 – డి సోడియం లవణం 400 గ్రాములు లేదా ఇథాక్సీసల్ఫ్యూరాన్ 50 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి కలుపుపై పడేటట్లు పిచికారీ చేయాలి.

కలుపు నిర్మూలనలో జాగ్రత్తలు అవసరం



రైతులు కలుపు నిర్మూలనలో జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా కలుపులో ఊద, నక్షత్రగడ్డి, తుంగ, బంగారుతీగ, ఎర్ర, తెల్ల పిల్ల గావురులు ఉంటాయి. కలుపు వల్ల దిగుబడికి, నాణ్యతకు అవరోధం కలుగుతుంది. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఆర్.దివ్య, మండల వ్యవసాయాధికారి, కైకలూరు

క్లుప్తంగా

దాత సహకారంతో రహదారి అభివృద్ధి



కొండిపర్రు(పామర్రు): స్థానిక విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి కొండిపర్రు గ్రామంలోకి వచ్చే సుమారు 600 మీటర్ల దూరం ఉన్న ప్రధాన రహదారి కురుస్తున్న వర్షాలకు గోతులమయంగా మారటంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన గ్రామానికి చెందిన దాత అల్లాడ శ్రీనివాసరావు తన సొంత నిధులు సుమారు రూ.70వేలతో రహదారి వెంబడి ఉన్న గోతులను 100 టన్నుల డస్టుతో పూడ్చించారు. స్థానికుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే అవి సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని వన్ టౌన్ సీఐ రమేష్ అన్నారు. స్థానిక రవీంద్ర భారతి హైస్కూల్లో మంగళవారం క్లాస్ లీడర్స్, స్కూల్ లీడర్(ఎస్‌పీఎల్) బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలంటే ఈ విధమైన కార్యక్రమాలు అవసరం అన్నారు. క్లాస్ లీడర్స్‌గా ఎన్నికైన వారిలో బాధ్యతలు పెరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ ప్రియాంక పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

కూచిపూడి(మొవ్వ): గ్రామాల్లో మలేరియా, డెంగీ, విష జ్వరాలబారిన పడకుండా మొవ్వ మండలం కూచిపూడిలో ముందస్తుగా దోమల నిర్మూలనకు దోమల నివారణ మందును పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం పిచికారీ చేశారు. అలాగే రహదారుల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.

పూడికతీత తొలగింపు



మండవల్లి: మోటూరు ఎల్ఎస్ డ్రెయిన్‌లో కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు పనులను మంగళవారం మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మోటూరు నుంచి కొల్లేరులో కలిసే 22 కిలో మీటర్ల డ్రెయిన్‌లో మురుగు నీరు కిందకి వెళ్లకపోవడం, పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పోవడంతో కైకలూరు, గుడివాడ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు డ్రెయిన్‌లో కిక్కిస, గుర్రపుడెక్క తొలగించేందుకు రైతులు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పిన్నమనేని మాట్లాడుతూ నిధులు మంజూరు లేకపోయినా ముందస్తుగా రైతులు పెట్టుబడి పెట్టి పనులు చేయడం ఆదర్శనీయమన్నారు. రైతులు నాని, కిరణ్‌రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులను నింపుకోండి

కైకలూరు: మండలంలో ఆయా గ్రామాల తాగునీటి చెరువులను నింపుకోవాలని కలిదిండి ఎంపీడీఓ జి.దినతేజ్ పేర్కొన్నారు. కలిదిండి తాగునీటి చెరువులో ఇంజిన్ల ద్వారా నీటిని నింపే ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటిని కోరుకొల్లు లాకుల ద్వారా క్యాంప్‌బెల్ కాలువకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విడుదల చేశారని చెప్పారు. శివారు గ్రామాల్లో ఉప్పు నీరు కొంత కాలువలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం కాలువల ద్వారా వస్తున్న నీటి ఉప్పు నీరు బయటకు వెళుతుందని తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో నీటి సరఫరాకు ఇబ్బందులు ఉండబోవన్నారు. సెక్రటరీ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళల్లో రుగ్మతలపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): మహిళల్లో హార్మోన్ల ప్రభావంతో అనేక రుగ్మతలు సంభవించే అవకాశం ఉందని, దీనిపై యువతులు, మహిళలు అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ వర్ష పాటిల్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాల్లో మంగళవారం కాలేజీ ఫౌండేషన్ డే సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపడం, లైఫ్ స్టైల్ డిజార్డర్స్, రుతు క్రమ సంబంధిత సమస్యలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ లిటిల్ ఫ్లవర్, స్టూడెంట్ డీన్ డాక్టర్ వీఎస్ మంగాదేవి పాల్గొన్నారు.

ఉచితంగా వరి విత్తనాలు సరఫరా చేయాలి

పామర్రు: ఉచితంగా వరి విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో నారుమళ్లతో పాటు వెదజల్లిన పొలాలు నీటమునిగి దెబ్బతిన్నాయన్నారు. దీంతో ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతికి తెలియజేశామని తెలిపారు. దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, వారికి ఉచితంగా వరి విత్తనాలను అందజేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

రేపు హెల్మెట్ వినియోగంపై అవగాహన

గుడివాడ టౌన్: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై ఈ నెల 18వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు 11వ అదనపు జిల్లా ఇన్‌చార్జి జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ గుడివాడ చైర్ పర్సన్ ఎస్.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక శ్రీ చైతన్య కళాశాల్లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుడివాడ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.గాయత్రి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు పాల్గొనాలని ఆమె కోరారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకుని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు జరిగాయి. సహాయకమీషనర్ నేల సంధ్య, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆషాఢ మాసం మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను వండి స్వామికి నివేదనలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలను ఆలయ అర్చకులు అగ్రిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి సుధాకర్ తెలిపారు.

కౌలురైతుల గుర్తింపు కార్డుల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంగళవారం పంపిణీ చేశారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు కార్యాలయం వద్ద ఈ కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శివకుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డుల వల్ల ప్రభుత్వం నుంచి రాయితీపై విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా, పంట నష్ట పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. భూ యజమానులు కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరుకు సహకరించాలని కోరారు.

'యూ డైస్' నమోదు పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ త్వరితగతిన యూ డైస్ నమోదు పూర్తికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నమోదు వల్ల విద్యార్థుల వివరాల అందుబాటులో ఉంటాయన్నారు. పాఠశాల మానివేసిన విద్యార్థుల వివరాలు డ్రాప్ బాక్సులో ఉంచాలని సూచించారు. ప్రతి విద్యార్థి పేరు ఏదో ఒక పాఠశాల్లో నమోదై ఉండాలని తెలిపారు. హాజరు పట్టికలో ఎంతమంది విద్యార్థులుంటే యూ డైస్‌లో అంతమంది నమోదు అయి ఉండాలని పేర్కొన్నారు.

వ్యవసాయరంగంలో సాంకేతికతను జోడించాలి

శాస్త్రవేత్త ఫణికుమార్



వేమవరప్పాడులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త ఫణికుమార్

కైకలూరు: నేటి సమాజానికి అనుగుణంగా వ్యవసాయరంగంలో సాంకేతికతను జోడించి అధిక దిగుబడులు సాధించాలని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. భూసార కార్డు ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కైకలూరు మండలం వేమవరప్పాడు, కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వరి పొలాలను పరిశీలించి కలుపు మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ పైరు 15 నుంచి 25 రోజులు వయసులో ఉన్నందున పైరజో సల్ఫ్యూరాన్, ప్రేటిల్లా క్లోర్, బెన్ సల్ఫ్యూరాన్ కలిపి ఎకరాకు నాలుగు కేజీలు లేదా ఇథాక్సి సల్ఫ్యూరాన్ ఎకరాకు 50 గ్రాములు లేదా బిస్పైరిబాక్ సోడియం 80–120 మిల్లీ లీటర్లు లేదా క్లించర్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు పిచికారీ చేసుకుని, కలుపును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, కైకలూరు, కలిదిండి వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, విద్యాసాగర్, వేమవరప్పాడు సర్పంచ్ నున్న రాంబాబు, వీఏఓ గోపినాథ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఇక్కట్లు



మురుగునీటిలో ఉన్న తాగునీటి కుళాయి

పామర్రు: గ్రామంలోని కోటిరెడ్డిపేటలో తాగునీటి కుళాయి నిల్వ ఉన్న మురుగునీటిలో ఉండటంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పేటలోని పబ్లిక్ ట్యాప్‌ను పల్లపు ప్రాంతంలో వేయడం వలన కురుస్తున్న వర్షాలకు చుట్టు పక్కల ప్రాంతాల్లోని వర్షపు నీరు వీధి కుళాయి వద్దకు చేరడంతో ఆ ప్రాంతం అంతా మురుగునీటి మయంగా మారింది. తాగునీటి కుళాయి ఆ మురుగునీటిలో ఉండిపోయింది. ఈ కుళాయి ద్వారా తాగునీరు కలుషితమవుతోందని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి స్థానిక ప్రజలు పలుమార్లు తెలియజేయటంతో మురుగునీటిలో ఉన్న కుళాయిని డమ్మీ చేసి వేరే చోట కుళాయి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మురుగు నీటిలో ఉన్న కుళాయిని డమ్మీ చేశారు, కానీ వేరే చోట కుళాయిని ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి స్పందించి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మండవల్లి: మండవల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆర్. బేబి శ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల పరిషత్ అధికారులు హాజరు కావాలని కోరారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ మండల సర్వ సభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం



మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము, తదితరులు

గుడివాడ టౌన్: పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, మురుగునీటి సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆయన పట్టణంలోని బస్టాండ్, ఏలూరు రోడ్, మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి, మురుగునీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘంలో అవసరం మేరకు ఉద్యోగులను ఏర్పాటు చేసి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. అనంతరం అధికారులతో మురుగునీటి ప్రవాహంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పనులు

మండవల్లి: మండవల్లి మొగలి చెరువు వద్ద విద్యుత్ పోల్స్‌కు మంగళవారం సర్పంచ్ మెండా ఝాన్సీ ఫ్యూజులు ఏర్పాటు చేయించారు. విద్యుత్ దీపాలు వెలగడానికి ఫ్యూజులు సక్రమంగా ఉండాలని ఆమె అన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

సీతమ్మకు ఆషాఢ సారె సమర్పణ



కైకలూరు: స్థానిక చిన్నచెరువు గట్టు సమీప మహిళలు వల్లీ దేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, రామాలయం, విఘ్నేశ్వర ఆలయాల్లో ఆషాఢ సారెను మంగళవారం అందించారు. మహిళలందరూ కలిసి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.